క్లుప్తంగా

పశువులకు టీకాలు వేయించాలి



పశు వైద్య శిబిరంలో జిల్లా పశు వైద్యాధికారి జైపాల్

అల్లవరం: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిని నివారించేందుకు టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్యాధికారి జైపాల్ అన్నారు. శుక్రవారం బోడసకుర్రులో ఏర్పాటుచేసిన పశు వైద్య శిబిరంలో 112 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన జైపాల్ మాట్లాడుతూ పశువుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. శిబిరంలో పశువైద్యాధికారి మేడిద నారాయణ రావు, జి.పట్టాభి, వెంకటేశ్వరరావు, వినయ్, త్రినాథ్, మణికంఠ, సత్యనారాయణ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న స్టేట్ కోఆర్డినేటర్ మృత్యుంజయరావు

తాళ్లరేవు: పర్యావరణ పరిరక్షణకు, జీవ వైవిధ్యానికి ఎంతగానో దోహదపడే వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలన్నారు. ప్రపంచ వన్య ప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చొల్లంగిలోని కోరింగ అభయారణ్యంలో ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వర ప్రసాద్ అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఐబీసీఎన్ స్టేట్ కోఆర్డినేటర్ కె.మృత్యుంజయరావు, ఆర్‌పీఎఫ్ కాకినాడ సీఐ కొండయ్య, చొల్లంగి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.పద్మావతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్‌లు ఎం.నాగార్జున, ఎస్.వీరభద్రరావు తదితరులు మడ అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ మహేష్, ఎస్.వరలక్ష్మి, బయాలజీ టీచర్ లత, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 19 మందికి ఉద్యోగాలు



జాబ్‌మేళాలో యువతకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

ఐ.పోలవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి మరియు శిక్షణ శాఖ, సీడాప్–డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ముత్తూట్ ఫైనాన్స్, మోహమ్ స్పిన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 50 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజరుకాగా 19 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ప్రభుత్వం నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు మండలస్థాయిలోనే కార్పొరేట్ కంపెనీలతో జాబ్‌మేళాలు నిర్వహిస్తుందని ఏపీఎం నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు సీహెచ్ సురేష్, ఓ.నాగబాబు, జాబ్స్ కోఆర్డినేటర్ శాంసన్ పాల్గొన్నారు.

బీవీసీలో సాఫ్ట్‌వేర్‌పై విద్యార్థులకు శిక్షణ

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ విభాగాల విద్యార్థులకు ఐసీటీ, హనీవెల్, కళాశాల యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో సాఫ్ట్‌వేర్‌పై శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఐసీటీ, హనీవెల్ ప్రతినిధులు సత్య, శేషగిరిరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ 12 రోజుల పాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీన్ జనార్దనరావు, కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గరుడ వాహనోత్సవం

యానాం: యానాం భూసమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గరుడ వాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. చింతా వెంకటసుబ్బారావు ఉత్సవదారులుగా నిర్వహించిన వాహనోత్సవంలో ధ్వజారోహణం జరిపారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి హాజరై విశేష పూజలు చేశారు.

యానాం సీఐగా షణ్ముగం

యానాం: యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.షణ్ముగంను నియమిస్తూ పుదుచ్చేరి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుభమ్‌ఘోష్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. షణ్ముగం ప్రస్తుతం కారైకల్‌లో పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన సీఐ శివగణేష్ పదవీ విరమణ పొందిన విషయం తెలిసిందే.

ఎన్నాళ్లు.. ఇంకెన్నేళ్లు..?

- నత్తనడకన జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం
- భూమి పూజ చేసి నాలుగేళ్లైనా పూర్తి కాని పనులు
- వచ్చే ఏడాది తరగతుల ప్రారంభంపైనా అనుమానాలు



గిరియాంపేటలో నిర్మిస్తున్న జాతీయ ఇంజినీరింగ్ కళాశాల భవనం



పూర్తి కాని విద్యుదీకరణ పనులు



కళాశాల భవనం ఎదుట నిలిచిపోయిన మురుగునీరు

యానాం: సరిగ్గా నాలుగేళ్ల క్రితం గిరియాంపేటలో రూ.26 కోట్ల రూసా నిధులతో ప్రభుత్వ జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇది పూర్తయితే ఇంజినీరింగ్ చదువుకోవడానికి వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న పుదుచ్చేరి తదితర ప్రాంతాలకు వెళుతున్న విద్యార్థుల కష్టాలు తీరతాయని ప్రజలు భావించారు. అయితే నత్తనడకన సాగుతున్న పనుల కారణంగా నేటికీ పూర్తిస్థాయిలో సివిల్ పనులే పూర్తి కాలేదు. ఎక్కడికక్కడ అసంపూర్తి భవనాలే దర్శనమిస్తున్నాయి. దీంతో రానున్న విద్యాసంవత్సరంలోనైనా ఇక్కడ తరగతులు ప్రారంభమవుతాయో లేదోనన్న సందేహం అందరినీ వెంటాడుతోంది.

అధునాతన సాంకేతిక కోర్సులు

2019 ఫిబ్రవరి 3వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ గిరియాంపేటలో జాతీయ ఇంజినీరింగ్ కళాశాలకు జమ్మూకశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ కళాశాలలో రోబోటిక్ ఆటోమేషన్, జియో ఇన్ఫర్మేటిక్స్ ఇంజినీరింగ్, 3డీ యానిమేషన్, గ్రాఫిక్స్ ఇంజినీరింగ్, డిజిటల్ టెక్నిక్స్ ఫర్ డిజైన్ అండ్ ప్లానింగ్ ఇంజినీరింగ్, కంప్యూటింగ్ ఇన్ మల్టీమీడియా ఇంజినీరింగ్ తదితర అధునాతన సాంకేతిక కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లుగా ప్రకటించారు. అయితే పనుల్లో జాప్యం కారణంగా ఇప్పటికే నాలుగేళ్లు గడిచిపోవడమే కాకుండా నిర్మాణం పూర్తికి వ్యయం పెరిగిపోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కళాశాలకు ఏఐసీటీఈ నుంచి సైతం అనుమతులు లభించినా నిర్మాణం పూర్తికాక తరగతులు ప్రారంభం కాలేదు.

నిధులొస్తేనే పనులు ముందుకు

ఇంజినీరింగ్ కళాశాలకు మూడు బ్లాక్‌లను నిర్మించారు తప్ప గదులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఇంకా రహదారులు, ప్రహరీ, డ్రైనేజీ నిర్మాణంతో పాటు కళాశాల ఎదురుగా ఉన్న స్థలాన్ని మట్టితో కప్పాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ పనుల్ని పుదుచ్చేరిలోని కాంట్రాక్టర్‌కు అప్పగించినా నేటికీ ప్రారంభించనేలేదు. అయితే మొత్తం పనుల నిమిత్తం మరో రూ.25 కోట్లు అవసరమని అంచనాలు రూపొందించి ప్రతిపాదనల్ని ఉన్నతాధికారులకు పంపించారు. ఆ ప్రతిపాదనలకు ఆమోదం ఎప్పుడొస్తుందో, నిధులెప్పుడొస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే వచ్చే విద్యా సంవత్సరంలో ఇక్కడ తరగతులు ప్రారంభం కావడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదని స్థానికులు సందేహం వెలిబుచ్చుతున్నారు.

> **మరిన్ని నిధులు అవసరం**
>
> జాతీయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తి చేయడానికి మరిన్ని నిధులు అవసరం. మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఏయే పనులకు ఎంతెంత వ్యయమవుతుందో తెలుపుతూ అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. అక్కడి నుంచి నిధులు విడుదల కాగానే త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం.
>
> – భాస్కర్, పీడబ్ల్యూడీ ఇంజినీర్, యానాం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో చనిపోయిన లక్ష్మణస్వామి

ముమ్మిడివరం: జాతీయ రహదారి 216లో నడిమలంక సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాతాడి లక్ష్మణస్వామి(40) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ముమ్మిడివరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప గ్రామానికి చెందిన లక్ష్మణస్వామి టీవీఎస్ మోటారు సైకిల్‌పై యానాం వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక నడిమిలంక వద్ద గడ్డి లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ప్రమాదవశాత్తూ అదే ట్రాక్టరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ముమ్మిడివరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆందోళనలకు సిద్ధం కావాలి

అమలాపురం టౌన్: ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర కార్యవర్గం రూపొందించిన కార్యాచరణకు అనుగుణంగా జిల్లా ఉద్యోగులు దశల వారీ ఆందోళనలకు సిద్ధం కావాలని ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ నేత ఎస్.కృష్ణమోహన్, వీర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆంజనేయకుమార్‌లు పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో జిల్లా శాఖ ఉద్యోగులు శుక్రవారం సమావేశమై కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో ఏపీ జేఏసీ ఉద్యోగుల జిల్లా చైర్మన్ డి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జి.చిరంజీవి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పు

- పొగలతో అవస్థలు పడిన 27, 28, 29 వార్డుల ప్రజలు
- ఫైరింజన్‌తో పొగల అదుపునకు చర్యలు



ఫైరింజన్ సాయంతో పొగలను అదుపు చేస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక బైపాస్ రోడ్డులో ప్రధాన పంట కాలువ చెంత ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పంటుకుని దట్టమైన పొగలు వ్యాపించడంతో 27, 28, 29 వార్డుల్లోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీనిపై 29వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కముజు రమణ మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఫైరింజన్ ఏర్పాటుచేసి పొగల్ని అదుపు చేయడానికి ప్రయత్నించారు.

నిజంగా మిథైన్ గ్యాస్‌తోనేనా?

మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది చెత్త గుట్టలకు మంట పెట్టి అంటించడం వల్లే దట్టమైన పొగలొచ్చి సమీప ప్రజలు అవస్థలు పడుతున్నారని స్థానిక ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అయితే మున్సిపల్ ఏఈ హేమంత్ కమల్ మాత్రం చెత్తకు పారిశుధ్య సిబ్బందెవరూ మంట పెట్టి అంటించలేదని కమిషనర్‌కు వివరణ ఇచ్చారు. చెత్త పొరల్లో మిథైన్ అనే గ్యాస్ ఉత్పన్నమై అధిక ఉష్ణోగ్రత పీడనం పెరిగి సహజంగా నిప్పు పుట్టి మంటలు వ్యాపించాయని చెప్పారు.

సాగునీటి కోసం ఆందోళన

- పీడబ్ల్యూడీ ఆఫీసుకు తాళం వేసి ధర్నా
- రైతులతో ఎమ్మెల్యే అశోక్ చర్చలు



ధర్నా చేస్తున్న రైతులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో శివారు భూములకు సాగునీరు అందించాలంటూ శుక్రవారం అధిక సంఖ్యలో రైతులు స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయానికి చేరుకుని గేటుకు తాళం వేయడంతో పాటు అక్కడే బైఠాయించి ఆందోళన నిర్వహించారు. దరియాలతిప్ప ఆయకట్టు పరిధిలోని భూములకు సాగునీరు అందక తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పీడబ్ల్యూడీ ఇంజినీర్లు నాగరాజు, హాస్పేస్, భాస్కర్ తదితరులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా తమకు సాగునీటిపై న్యాయం చేస్తామని హామీ ఇస్తేనా ధర్నా విరమిస్తామని భీష్మించుకుని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి అక్కడకు చేరుకుని రైతులతో సుమారు గంట పాటు చర్చించారు. ధవళేశ్వరం ఇరిగేషన్ అధికారులతో చర్చించి సాగునీరు వచ్చేలా కృషి చేస్తామని నచ్చజెప్పారు. దరియాలతిప్ప, దొమ్మేటిపేట, అడివిపాలెం ఆయకట్టుకు ఇంజినీరు జ్యోతిరాజును నియమిస్తున్నట్లు తెలపడంతో రైతులు ఆందోళనను విరమించారు. ఈ ఆందోళనలో రైతు నాయకులు తిరుకోటి నాగేశ్వరరావు, మాగాపు సుబ్బారావు, సబ్బతి లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్ సమావేశం

దరియాలతిప్ప సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పందించి ధవళేశ్వరం ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీరు జి.శ్రీనివాసరావుతో స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో సమావేశమై చర్చించారు. యానాంకు అదనంగా నీటిని విడుదల చేస్తామని, సాగు, తాగునీటి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ కుడుపూడికి సత్కారం



ఎమ్మెల్సీ కుడుపూడిని సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన కుడుపూడి సూర్యనారాయణరావును పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక హైస్కూలు సెంటరులో శుక్రవారం ఘనంగా సత్కరించారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కల్లపల్లి గోవింద్, కార్యదర్శి నేదునూరి తరుణ్, గౌరవ సలహాదారుడు కొరవాడ శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు ఇరవాడ వీరబ్రహ్మం, ఉప్పాడ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన శాసనసభ్యుడిని వేధించడం తగదు

యానాం: పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఇచ్చిన నామినేటెడ్ పదవిని అడ్డం పెట్టుకుని యానాం నియోజకవర్గం నుంచి ఎన్నికైన శాసనసభ్యుడిని మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు వేధించడం తగదని పుదుచ్చేరి అన్నాడీఎంకే డిప్యూటీ సెక్రటరీ వైయాపురి మణికండన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యానాం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పోటీ చేసి ఓడిపోయారని, ఈ నేపథ్యంలో మల్లాడి కృష్ణారావుకు ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి పదవిని కట్టబెట్టారన్నారు. స్వతంత్ర ఎమ్మెల్యే ప్రాథమిక హక్కులను కాలరాయడానికే ఆయన తన పదవిని వినియోగించుకుంటున్నారని ఆరోపించారు.

బీపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

అమలాపురం రూరల్: భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో రాజేష్ బీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కళాశాల అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం సతీష్ శుక్రవారం ప్రారంభించారు. కనకయ్య బ్యాటింగ్ చేయగా సతీష్ బౌలింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. 12 రోజుల పాటు ఈ టోర్నమెంట్ కొనసాగుతుందని, మొత్తం ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయని పీడీ రవణం మాధవి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, ఏవో జక్కం కృష్ణారావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఫణిశంకర్, బీపీఎల్ కోఆర్డినేటర్ గొలకోటి మూర్తి పాల్గొన్నారు.

6న వైఎస్సార్ సీపీ గృహ సారథుల సమావేశం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ పట్టణ గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం ఈ నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక ఎర్ర వంతెన వద్ద గల డీఎస్ఎస్ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లకు దిశా నిర్దేశం చేస్తారన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాలయోగికి ఘన నివాళి



బాలయోగి విగ్రహానికి నివాళులర్పిస్తున్న హరీష్ బాలయోగి తదితరులు

కాట్రేనికోన: కాట్రేనికోన గేట్ సెంటరులో మాజీ లోక్‌సభ స్పీకర్, దివంగత జీఎంసీ బాలయోగి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాట్రేనికోన టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, నాగిడి నాగేశ్వరరావు, వెంట్రు సుధీర్, ఆకాశం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి 21వ వర్ధంతి సందర్భంగా స్థానిక పోలమ్మ చెరువుగట్టు వద్ద ఉన్న బాలయోగి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొలకోటి దొర బాబు, చెల్లి అశోక్, విజయ్‌భాస్కర వర్మ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద ఉన్న బాలయోగి విగ్రహానికి టీడీపీ నాయకులు ధూళిపూడి వెంకటరమణ, పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అమలాపురం రూరల్: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 21వ వర్ధంతి సందర్భంగా బాలయోగి ఘాట్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలయోగి కుమారుడు, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జీఎం హరీష్ బాలయోగి మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధికి దోహదపడే కోటిపల్లి– నరసాపురం రైల్వే ప్రాజెక్టును పూర్తి చేసే దిశగా పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రి పీవీ రాఘవులు, మాజీ ఎమెల్యే చిల్లా జగదీశ్వరి, చిక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి రూ.కోటి కేటాయింపు



సమావేశంలో సమస్యలను వివరిస్తున్న సర్పంచ్ బుల్లియ్య

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం గ్రామంలో రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి చేయడానికి రూ.కోటి రూపాయల నిధులను మార్చి 31 లోగా అందిస్తామని ఓఎన్‌జీసీ అధికారులు వెల్లడించినట్టు సర్పంచ్ కుంచే బుల్లియ్య తెలిపారు. రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో గ్రామ సర్పంచ్ కుంచే బుల్లియ్య, పార్టీ నాయకుడు కుంపట్ల మహాలక్ష్మీనాయుడు కలెక్టర్ హిమాన్షు శుక్లాను శుక్రవారం కలిసి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. కలెక్టర్ సూచనతో అక్కడే తహసీల్దార్ వెంకటేశ్వరి, ఓఎన్‌జీసీ అధికారులు నవేద్‌రావు, జీవీఎల్ ప్రసాద్‌లతో చర్చలు జరిపి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం గోపవరంలో సర్పంచ్ బుల్లియ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు మండల అధికారులు, ఓఎన్‌జీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్చి 31లోగా గ్రామాభివృద్ధికి రూ.కోటి నిధులు కేటాయిస్తామని ఓఎన్‌జీసీ అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షుడు అడపా రమేష్, పార్టీ నాయకులు నల్లా వెంకన్నబాబు, కుంచే బాబులు, సింగొటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాంపు ఏరియాలో తరచూ చనిపోతున్న చేపలు



ఎస్.యానాంలో మృత్యువాత పడిన చేపలను చూపుతున్న మత్స్యకారుడు

ఉప్పలగుప్తం: మండల పరిధిలోని ఎస్.యానాం తీర ప్రాంత స్వాంపు ఏరియాలో తరచూ చేపలు, రొయ్యలు మృత్యువాత పడుతున్నాయి. ఎగువ ప్రాంతంలో ఉన్న ఆక్వా చెరువుల రసాయన వ్యర్థాలు లేదా స్థానికంగా ఉన్న రవ్వ ప్లాంటు వ్యర్థాల వల్లే మత్స్య సంపద చనిపోతున్నాయని స్థానిక మత్స్యకారులు శుక్రవారం తెలిపారు. ఇలాగే కొనసాగితే వేటనే నమ్ముకుని బతుకుతున్న మత్స్యకారుల జీవనోపాధికి గండి పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



గ్యాస్ సిలెండర్, కట్టెల పొయ్యితో నిరసన తెలుపుతున్న ఐద్వా మహిళలు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అమలాపురం పట్టణంలోని కార్మికనగర్, మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో ఐద్వా ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేశారు. గ్యాస్ సిలెండర్‌ను, వెలుగుతున్న కట్టెల పొయ్యను ప్రదర్శిస్తూ ధరల పెంపుదలకు వ్యతిరేకంగా నినదించారు. సిలెండర్‌పై మరోసారి రూ.50 పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో జిల్లా ఐద్వా అధ్యక్షురాలు ఎండీ హమిదునిష, కార్యదర్శి టి.నాగవరలక్ష్మి, ఐద్వా ప్రతినిధులు ఎం.సీతారత్నం, సోమాలమ్మ, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని జిల్లా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బండారులంక గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినపుడు రాష్ట్రంలో వంట గ్యాస్ ధర 441 రూపాయలు ఉండేదని, ఇప్పుడది 1170 రూపాయలకు పెరిగిందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.వసంత కుమార్ అన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీర వెంకట్రావు, సరెళ్ల మేరి, వెంకాయమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రుంగ్టా ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలు సఫలం



ఒప్పందం చేసుకున్న అనంతరం కార్మికులు, యాజమాన్యం

యానాం: స్థానిక రుంగ్టా ఇరిగేషన్ ఫ్యాక్టరీ కార్మికులు తమ డిమాండ్ల కోసం గత కొద్దిరోజులుగా చేస్తున్న నిరసనల నేపథ్యంలో శుక్రవారం అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో కార్మికులు, యాజమాన్యంతో జరిగిన చర్చలు సఫలమయ్యాయి. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్ కార్మికుల తరపున మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఉందన్నారు. చివరికి కార్మికులకు ఇంక్రిమెంట్ 28 శాతం, బోనస్ 12 శాతం ఇచ్చేలా ఒప్పందం జరిగింది. కార్యక్రమంలో సూర్యనారాయణ, నాగేశ్వరరావు, మధుబాబు, దాసు, రాజశేఖర్, సోమరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం కోసం రూ.50 వేల విరాళం



విద్యార్థులకు బిస్కెట్లు అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అమలాపురం రూరల్: బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్‌లో అల్పాహారం అందించే నిమిత్తం బండారులంక విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. శుక్రవారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెదపూడి బాబూరావు చేతుల మీదుగా సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు బళ్ల మల్లేశ్వరరావు, సెక్రటరీ శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు జాన గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేంకటేశ్వరస్వామివారి కల్యాణం

యానాం: యానాంలో కొలువైన భూసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి దివ్యకల్యాణం శనివారం వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. యానాం ప్రజల తరపున ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దంపతులచే ముత్యాల తలంబ్రాలు, మంగళ సూత్రాలు స్వామివారికి సమర్పిస్తారు. పుదుచ్చేరి ప్రభుత్వం తరపున ఆర్‌ఏఓ మునిస్వామి దంపతులు స్వామికి పట్టుపీతాంబరాలు, సువర్ణ యజ్ఞోపవీతం సమర్పించనున్నారు.

వివక్ష లేని సమాజం అవసరం

యానాం: బాలికా వివక్ష లేని సమాజానికి అందరూ కృషి చేయాల్సిన అవసరముందని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో బేటీబచావో బేటీపడావో కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అనేక చోట్ల భ్రూణ హత్యలు లింగనిష్పత్తి తగ్గుదలకు దారితీశాయన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, హెచ్ఎం దంగేటి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఉమా రామలింగేశ్వర స్వామి దివ్య కల్యాణం



స్వామి వారి దివ్య కల్యాణం జరుపుతున్న అర్చకులు

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో మురుగులమ్మ ఆలయం వద్ద బాలా త్రిపుర సుందరీ సమేత ఉమా రామలింగేశ్వర స్వామి వారి దివ్య కల్యాణం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు పట్టు వస్త్రాలు, మంగళ సూత్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.